

కళ్యాణ కర్ణాటకకు ప్రత్యేక సచివాలయం

● ఆల్మట్టి ముంపు బాధితులకు పరిహారం ఖరారు ● ట్రిబ్యునల్ తీర్పు మేరకు ఎత్తు పెంపు ● మంత్రివర్గంలో పలు కీలక నిర్ణయాలు

బెంగళూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కళ్యాణకర్ణాటకకు ప్రత్యేక సచివాలయం ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. మంగళవారం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. కేబినెట్ వివరాలను సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌ల సమక్షంలోనే శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వివరించారు. కళ్యాణకర్ణాటకకు అనుబంధమైన బీదర్, కలబురిగి, రాయచూరు, బళ్ళారి, విజయనగర, యాదగిరి, కొప్పళ జిల్లాలకు అనుబంధంగా ప్రత్యేక సచివాలయం ఏర్పాటు చేయదలచినట్లు తెలిపారు. కృష్ణానదికి అనుబంధంగా విజయపురలో ఉండే ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచే విషయమై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. ప్రాజెక్టు-3 నిర్మాణాల ద్వారా భూమి కోల్పోయే ముంపు ప్రాంత బాధిత రైతులకు ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. బాధిత రైతులకు మెట్ట భూమికి ఎకరాకు రూ.30లక్షలు, సాగు భూమికి రూ.40లక్షలు ఇచ్చేలా తీర్మానించారు. ఇక కాలువల నిర్మాణాలకు అవసరం అయ్యే 51వేల ఎకరాల భూమి అవసరమని అందుకు పరిహారంగా మెట్టభూమి ఎకరాకు రూ25లక్షలు, సాగు భూమికి రూ.30లక్షలు ఇవ్వాలని నిర్ణయించారు. ముంపు భూమితో పాటు కాలువల నిర్మాణాలకు 1.33లక్షల ఎకరాలు అవసరంగా ఉంది. ప్రాజెక్టు ద్వారా 20 గ్రామాలు ముంపు బారిన పడతాయన్నారు. ప్రాజెక్టు ఖర్చు సుమారు రూ.70వేల కోట్లు కానుందని వివరించారు. ఆల్మట్టి ప్రాజెక్టు ప్రస్తుతం 519.6 మీటర్‌లుగా ఉందని 524.256 మీటర్లకు పెంచుకునేందుకు ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చిందన్నారు. ఐదు మీటర్‌లు ఎత్తు పెంచడం ద్వారా 75వేల ఎకరాల భూమి ముంపునకు గురవుతుండగా తద్వారా 5లక్షల హెక్టార్‌లకు సాగునీరు లభించనుందన్నారు. రైతులు సాగుచేసుకునేందుకు అనుకూలం కానుందన్నారు. ఉత్తరకర్ణాటకలోని ప్రధానమైన బాగల్‌కోట, విజయపుర, కలబురగి, యాదగిరి, రాయచూరు జిల్లాలకు శాశ్వత నీరు సాధ్యం కానుందన్నారు. కృష్ణానది ఉపనదులైన భీమా ఇతర నదుల నీటిని వినియోగించుకుని కరువు పీడిత ప్రాంతాలకు శాశ్వతంగా సాగునీరు సమకూర్చే ప్రాజెక్టుగా ఉందన్నారు. రాష్ట్రం తన వాటా నీటిని సద్వినియోగం చేసుకునేందుకు కేంద్ర జలశక్తి మంత్రిని రెండుసార్లు ముఖ్యమంత్రి కలిసి చర్చలు జరిపారన్నారు. రాజకీయ ఒత్తిళ్ళు ఉన్నాయని మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి సభ ఒకసారి వాయిదా పడిందన్నారు. కాగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్రఫడ్నవీస్ ఇటీవల ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచకుండా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించిన మేరకు ప్రత్యేకంగా పోరాటం చేస్తామన్నారు. ఓ వైపు కేంద్రం గెజిట్ రూపంలో ఆదేశాలు జారీచేయలేదని, మరోవైపు పొరుగు రాష్ట్రాల నుంచి ఒత్తిళ్ళు ఉన్నాయన్నారు. కానీ ట్రిబ్యునల్ తీర్పు కీలకం కానుందన్నారు. మహారాష్ట్రకు ప్రత్యామ్నాయల లేదన్నారు. అయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అంగీకరించవచ్చునని విశ్వాసం ఉందన్నారు. ప్రస్తుతం ప్రకటించిన పరిహారానికి రైతులు అంగీకరిస్తారని భావిస్తున్నామన్నారు.


మీడియా సమావేశంలో సీఎం సిద్దరామయ్య , డీసీఎం డీకే శివకుమార్ , మంత్రి పాటిల్

ప్రతిపక్ష సభ్యులకూ పాతిక కోట్లు

● బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలకు రూ.25 కోట్ల గ్రాంట్: సీఎం సిద్దరామయ్య



బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ పార్టీల శాసనసభ్యులకు రూ.25 కోట్ల గ్రాంటును విడుదల చేయదలచినట్లు ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. ఈమేరకు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా 2025-26వ సంవత్సరానికిగాను ఎమ్మెల్యేలకు రూ.25కోట్లు గ్రాంటు విడుదల చేస్తున్నట్లు ప్రత్యేకంగా మంగళవారం లేఖలు రాశారు. ముఖ్యమంత్రి మౌలిక అభివృద్ధి పథకం కింద ప్రతి నియోజకవర్గానికి రూ.25కోట్లు ప్రత్యేక గ్రాంటు కేటాయిస్తున్నట్లు తీర్మానించారు. అందుకు అనుగుణంగా నియోజకవర్గాలలో అభివృద్ధి పనులు అమలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని లేఖల్లో సూచించారు. ప్రజాపనులు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలతో పాటు నగరాభివృద్ధి విభాగాల నుంచి పనులు అమలు చేసుకునేందుకు వీలుంది. అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ఇటీవల ప్రతి నియోజకవర్గానికి రూ.50కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అప్పట్లోనే అధికార పార్టీకు చెందిన వారు మాత్రమే శాసనసభ్యులా ఇతరులు గెలిచిన నియోజకవర్గాలు రాష్ట్రంలో లేవా అంటూ పలు విమర్శలు వచ్చాయి. సాధారణంగా అధికారపార్టీ సభ్యులకు ఎక్కువ గ్రాంట్లు విడుదల చేసుకునే విధానం గతంలోను కొనసాగింది.

బీసీ కులాలను అవమానపరిచే కుట్ర

7

● గవర్నర్‌కు సామాజిక న్యాయ జాగృతి వేదిక ఫిర్యాదు



హరిహర వెళుతున్న రాజహంస బస్సు

ప్రాణం పోతున్నా ప్రయాణికులను కాపాడారు

● గుండెపోటుతో రాజహంస బస్సు డ్రైవర్ మృతి
● రోడ్డు పక్కనే ఆపడంతో అందరూ సురక్షితం

7

ఓవర్‌టేక్

● ఓవర్‌టేక్ చేయబోయి లారీని ఢీకొన్న ప్రైవైట్ బస్సు
● ఇద్దరి దుర్మరణం 8 మందికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న ప్రైవేట్ బస్సు, లారీ

కలిసుంటేనే కమలవికాసం

● బీజేపీలో గ్రూప్‌లకు చెక్‌పెట్టేందుకు అధిష్ఠానం కసరత్తు ● రేపటి నుంచి చింతనమంతన పేరిట ప్రత్యేక సభలు ● ప్రహ్లాద్‌జోషి, బీఎల్ సంతోష్‌కు బాధ్యతలు


బీజేపీ కార్యాలయం


విజయేంద్ర


యత్నాళ్


కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి


బీఎల్ సంతోష్

బెంగళూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బీజేపీలో క్రమశిక్షణ లోపించి బహిరంగంగానే గ్రూపు విబేధాలు బయట పెడుతున్న తరుణంలో వివాదాలకు చెక్ పెట్టేందుకు అధిష్టానం సిద్ధం అయ్యింది. శాసనసభ ఎన్నికలు జరిగిన రెండేళ్ళ నుంచి కొంతమేర విభాధాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే ఏడాది పాటు అధిష్టానం మౌనంగానే గడిపింది. ఎవరిని కదిపినా లోక్‌సభ ఎన్నికలకు ఇబ్బంది కలుగవచ్చునని వెనకడుగు వేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత దాదాపు ఏడాది కాలంగా రాష్ట్ర పార్టీలోని గ్రూపు విభేధాల గురించి ఏమాత్రం పట్టించుకోని అధిష్టానం పెద్దలు ఇటీవలే పార్టీ సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. ఆతర్వాత కూడా గ్రూపు విభేధాలు కొనసాగుతూనే ఉఆన్నయి. సీనియర్లు ఎవరికి వారు యమునా తీరే అన్నట్టే ఉన్నారు. సుదీర్ఘకాలం తర్వాత వ్యతిరేక బృందంలోని మాజీ మంత్రి అరవింద లింబావళి పార్టీ కార్యాలయానికి తప్పనిసరి పరిస్థితిలో వచ్చిన విషయం తెలిసిందే. అది కూడా ఆయన భార్య ఎమ్మెల్యేగా కొనసాగుతున్న మహదేవపుర పరిధిలో ఓట్లచౌర్యం జరిగిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపణలు చేయడంతో పాటు బెంగళూరులో భారీ బహిరంగ సభ నిర్వహించిన మేరకు పార్టీ ఆఫీసుకు వచ్చి విమర్శలను తిప్పికొట్టారు. ప్రస్తుతం శాసనసభ వంటి ఎన్నికలు సమీపంలో లేకున్నా పంచాయతీ, తాలూకా, నగర, జిల్లా పంచాయతీలకు ఎన్నికలు జరపాలని అధికార కాంగ్రెస్ భావిస్తున్న తరుణంలో విభేధాలను కొనసాగిస్తే మరింత నష్టమే మిగలనుందని అధిష్టానం భావిసుస్తన్నట్లు తెలుస్తోంది. అందుకే గ్రూపు విభేధాలను వీడి అందరినీ ఒకే తాటిపైకి తేవాలని ప్రయత్నాలు మొదలు పెట్టింది.

విజయేంద్రపైనే వ్యతరేకత

రాష్ట్ర బీజేపీలో ప్రస్తుతం పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర వర్గం, ఆయనను వ్యతిరేకించే గ్రూపులు కొనసాగుతున్నాయి. కీలకనేతలంతా విజయేంద్రకు మద్దతు ఇచ్చినట్లే ఉన్నా అవకాశం వస్తే తమ అభిప్రాయం తెలిపేందుకు సిద్దమనే రీతిలో వ్యతిరేకిస్తున్నారు. కొన్నేళ్ళకాలంగా రాష్ట్ర బీజేపీలో యడియూరప్ప ప్రభావంతోనే కొనసాగింది. ప్రాథమిక స్థాయి నుంచి రాష్ట్రంలో ఏకంగా బీజేపీ ప్రభుత్వం ఏర్పడే స్థాయికి తీసుకొచ్చిన ఘనత ఆయనదే. కానీ ఇటీవల కొన్నేళ్ళుగా ఆయనను వ్యతిరేకించడమే విధిగా బసనగౌడ పాటిల్ యత్నాళ్ వ్యవహరిస్తున్నారు. ఆయనకు మద్దతుగా మాజీ కేంద్రమంత్రి జీఎం సిద్దేశ్వర్, రాష్ట్ర మాజీ మంత్రి అరవింద లింబావళితో పాటు సీనియర్‌నేత రమేష్ జార్కిహోళి వంటి వారున్నారు. వీరి ప్రధాన డిమాండ్ విజయేంద్ర సారథ్యంలో పనిచేయలేమని మరెవరిని అధ్యక్షుడిని చేసినా అభ్యంతరం లేదంటూ బహిరంగంగానే ప్రకటించారు. ఢిల్లీ వెళ్ళి అధిష్టానం పెద్దలకు ఇవే అంశాలను ప్రతిపాదించారు. రాష్ట్రం నుంచి కేంద్ర కేబినెట్‌లో కొనసాగుతున్న ప్రహ్లాద్‌జోషి, శోభాకరంద్లాజె, సోమణ్ణ వంటి వారు జోక్యం చేసుకోకపోవడం కూడా అనుమానాలకు తావిస్తోంది.

విబేధాలు వీడేందుకే...

గ్రూపు విభేధాలను స్వస్తి పలికించేందుకు చింతనమంతన పేరుతో రెండు రోజుల సభలను ఏర్పాటు చేసేలా పార్టీ అధిష్టానం ఆదేశించింది. రాష్ట్రంలో గ్రూపులు ఉండరాదని అందరూ కలిసి పనిచేసేలాంటి తీర్మానాలు తీసుకోవాలని నిర్ణయించారు. పార్టీకి సంబంధించిన అన్ని అంశాలను సభకు ముందే ఒక కొలిక్కి తీసుకురావాలని కూడా నిర్ణయించినట్లు తెలుస్తోంది. చింతనమంతన సభకు బీజేపీ జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషిలకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే జోషి ఓ విడతగా అరవింద లింబావళి, కుమారబంగారప్ప జీఎం సిద్దేశ్వర్, విజయేంద్రలతో మాజీ డీసీఎం డాక్టర్ అశ్వత్తనారాయణ నివాసంలో చర్చలు జరిగాయి. సభలో ప్రధానంగా యత్నాళ్‌పై ఉండే సస్పెన్షన్ వేటును తొలగించాలనేది ప్రధాన అజెండాగా రెబల్స్‌ను నేతలు కోరినట్లు తెలుస్తోంది. ఇటీవలే ఓ కేంద్రమంత్రి వద్ద హోంమంత్రి అమిత్‌షా కర్ణాటకలో యత్నాళ్‌పై చర్యలు తీసుకొని తప్పు చేశామని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. తాజాగా గణేష్ ఉత్సవాలకు వివిధ ప్రాంతాలకు వెళ్ళిన యత్నాళ్‌కు ప్రజాదరణ విషయమై పార్టీలో తీవ్ర చర్చ జరిగినట్లు తెలుస్తోంది. వినాయక నిమజ్జనం వేళ గొడవ జరిగిన మద్దూరులో యత్నాళ్‌ను వేలాది మంది యువత స్వాగతించడం, హిందువులకు కష్టం వస్తే అండగా ఉంటానంటూ భరోసా ఇవ్వడమే కాకుండా హిందుత్వ పేరుతో కొత్త పార్టీ ఏర్పాటు చేస్తానని ప్రకటించడం బీజేపీలో తీవ్ర చర్చకు కారణమైంది. అయితే మరుసటి రోజునే పార్టీ ఇప్పుడే పెడతాననే ఆలోచన లేదని యత్నాళ్ దాటవేయడంతో కొంత ఉపశమనం కలిగించినట్లు అయ్యింది. ఒకవేళ యత్నాళ్ కొత్తపార్టీ పెడితే రాష్ట్రంలో బీజేపీతో ఉండే హిందూసంఘాలు ఆయన వైపు వెళ్ళినా ఆశ్చర్య పోవాల్సిన పని లేదు. ఇక మరో ఫైర్‌బ్రాండ్‌గా పేరొందిన ఈశ్వరప్పను కూడా పార్టీలో చేర్చుకునే అంశం కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. చింతన మంతన పేరుతో జరిగే రెండు రోజుల సభలో పార్టీ నేతలందరినీ ఒక్కటి చేయడమే లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరో రెండు రోజులలో బీజేపీలో ఎటువంటి నిర్ణయాలు చోటు చేసుకుంటాయనేది వేచి చూడాల్సి ఉంది.


రాణిబెన్నూరులో కుప్పగా వేసిన వెల్లుల్లి పంట

అన్నదాతను ముంచేసిన వెల్లుల్లి

● ఏడాది కిందట రూ.30వేలు
● నేడు క్వింటం రూ.3 వేలు
● నష్టాల బాటలో రైతు

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వెల్లుల్లి పంట చేతకొచ్చిన వేళ మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాష్ట్రంలో ఉత్తర కర్ణాటక జిల్లాలో ఏటా విస్తారంగా వెల్లుల్లి సాగు చేస్తారు. హావేరి జిల్లా వ్యాప్తంగా ఇదే పంటకు రైతులు ప్రాధాన్యం ఇస్తారు. సాధారణంగా ఎకరా విస్తీర్ణంలో సాగు చేసే వెల్లుల్లి 7-9 క్వింటాళ్ళు దిగుమతి లభించవచ్చు. వెల్లుల్లికి ఏడాది పొడవునా మార్కెట్‌లో ధరలు ఉంటాయి. ఇలా చేతికొచ్చిన పంటను హావేరితో పాటు వివిధ ప్రాంతాల మార్కెట్‌లలో విక్రయించుకుంటారు. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబరు మాసంలో క్వింటాలు వెల్లుల్లి రూ.30-40 వేల దాకా ధరపలికింది. దీంతో ఈ ఏడాది రైతులు హావేరి జిల్లా వ్యాప్తంగా వెల్లుల్లి విస్తారంగా సాగుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కోత తర్వాత పంటను పూర్తిగా ఆరబెట్టేందుకు సాధ్యం కాలేదు. ఇలా కారణం ఏదైనా ప్రస్తుతం క్వింటాలు వెల్లుల్లి రూ.3- 5వేల వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఇలా క్వింటాలుపై ఏకంగా 90శాతం కోల్పోవలసి వచ్చింది. వెల్లుల్లి పంటకు ఒకటి రెండుసార్లు మంచి వర్షం కురిస్తే చాలు ఎండ ప్రభావానికి పంట బాగా పండుతుంది. ఇక కోతల తర్వాత ఎండలో ఆరబెట్టాల్సి ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో కోతలు కూడా చేయలేక పోయారు. ఇక కోసిన పంట కూడా ఎండలేక కుళ్ళిపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. వెల్లుల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అటు ఉల్లిరైతు పరిస్థితి దారుణంగా ఉండి కనీసం క్వింటం రూ.1000 కూడా పోవడం లేదని అన్నదాతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నడక పందెంలో పాల్గొన్న బామ్మలు

అవ్వారే..!

● ఉత్సాహంగా పాల్గొన్న అవ్వాతాతలు
● బళ్లారిలో ఘనంగా వృద్ధుల దినోత్సవం

8


ఆకాశంలో అకట్టుకుంటున్న ఇంద్రధనుస్సు

7

ఆకట్టుకున్న హరివిల్లు



నాన్న భుజాలపైనే పరీక్షకు

రాయచూరు సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): కూతురంటే బరువు కాదు..బాధ్యత అనుకున్నాడా తండ్రి. కూతురు క్షేమం కోసం భుజాలపైనే ఎక్కించుకుని వాగు దాటించారు. రాయచూరు జిల్లాలోని లింగసుగూరు తాలూకా ఆనెహోసూరు, జాగీర్ నందిహాళ్ గ్రామాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగు పొంగి పొర్లడంతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు బడికి వెళ్లాలంటే నానా కష్టాలు పడుతున్నారు. పాటు పలువురు విద్యార్థులు దాదాపు 20 కీ.మీ చుట్టు తిరిగి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. త్రైమాసిక పరీక్షలకు హాజరయ్యేందుకు ఈచనాళ గ్రామం కూతురును భుజాలపై మోస్తూ బడికి తీసుకెళ్తూ కనిపించిన దృశ్యాలు తండ్రి ప్రేమను చాటుతున్నాయని పలవురు అభిప్రాయపడ్డారు.


కూతురిని భుజాలపై వాగు దాటిస్తున్న తండ్రి

వ్యసనంతో పతనం..!

దొంగగా మారిన విశ్రాంత సైనికుడు.. ఆర్మీ నుంచి వచ్చాక 14 బ్యాంకులలో చోరీ

ఎనిమిదేళ్లు బయట.. ఎనిమిదేళ్లు జైలు జీవితం
తూమకుంట ఎస్‌బీఐ చోరీ కేసులో మళ్లీ జైలుకు..
ఉన్నత కుటుంబంలో పుట్టిన అనిల్ కుమార్ పన్వార్

హిందూపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తూమకుంట చెక్ పోస్టు వద్ద ఎస్‌బీఐలో చోరీ గుర్తు ఉంది కదా..? సెలవు రోజున బ్యాంకులో చొరబడి.. ఏకంగా 11 కిలోల బంగారాన్ని, రూ.40 లక్షల నగదును ఎత్తుకుపోయారు. ఈ కేసులో ఇద్దరు నిందితులు కాగా, వీరిలో ఒకరు మాజీ సైనికుడు..! చెడు సావాసాలు ఎంతటి గొప్పవారినైనా పతనం చేస్తాయి అనేందుకు ఇతని జీవితమే నిదర్శనం. ఒకనాడు చైనా సరిహద్దుల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహించిన వీరుడు.. ఇప్పుడు కటకటాల వెనుక శిక్ష అనుభవిస్తున్నాడు. అతని పేరు అనిల్ కుమార్ పన్వార్. హరియాణాలోని గుర్గావ్ జిల్లా మారుతీ కుంజ్ అనిల్ గ్రామం. మిలటరీ నుంచి తిరిగి వచ్చిన తరువాత అనిల్ చర్ఖీదాద్రి జిల్లా సాన్వర్ గ్రామంలో స్థిరపడ్డాడు. అనిల్ తండ్రి జైపాల్ సింగ్ మూడున్నర దశాబ్దాలపాటు మారుతీ కుంజ్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సేవలు అందించారు. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా, అనిల్‌ను దేశ సేవకోసం పంపించారు. మరో కుమారుడికి వ్యవసాయం, ఊరి పెద్దరికం బాధ్యతలను అప్పగించారు. నాలుగు వేలకు పైగా జనాభా ఉన్న ఆ పంచాయతీలో వీరి కుటుంబానికి ఎంతో మంచి పేరు ఉంది. అనిల్ ఏడేళ్లకుపైగా సైన్యంలో పనిచేశాడు. రిటైర్మెంట్ తరువాత తిరిగి వచ్చాడు. అప్పుడే స్థానికంగా పేకాటరాయుళ్లతో పరిచయం ఏర్పడింది. జూదంలో డబ్బులు పోగొట్టుకున్నాడు. భారీగా అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకు, ఎక్కువ డబ్బు సంపాదించేందుకు అడ్డదారులు వెతుక్కున్నాడు. మొదట సొంతూరు సమీపంలోని ఓ బ్యాంకులో చోరీ చేశాడు. ఆ తరువాత మరో 13 బ్యాంకులలో చోరీలు చేశాడు. మధ్య మధ్యలో జైలుకు వెళ్లి వచ్చాడు. కానీ మార్పు రాలేదు.


సీసీ టీవీ ఫుటేజీలో నిందితుడు

వచ్చిన ఏడాదిలోనే..

అనిల్ కుమార్ 2007లో ఆర్మీ నుంచి తిరిగి వచ్చాడు. ఆ తరువాత ఏడాదికే బ్యాంకులలో చోరీలను మొదలు పెట్టాడు. చోరీ చేయడం.. పోలీసులకు దొరకడం.. జైలుకు వెళ్లడం.. అక్కడే మరో చోరీకి స్కెచ్ వేయడం.. బయటకు వచ్చిన నెలలోనే మళ్లీ బ్యాంకు చోరీ చేయడం పరిపాటిగా మారిపోయింది. మొదటి దొంగతనం కేసులో అనిల్‌ను అరెస్టు చేసే సమయంలో పోలీసులు అతని తండ్రికి సమాచారం ఇచ్చారు. కొడుకు ముఖం చూసేందుకూ ఆయన ఇష్టపడలేదని సమాచారం. ఆయన సోదరుడు సైతం 'అతన్ని తీసుకెళ్లి ఏమైనా చేసుకోండి..' అని ఆవేదన వ్యక్తం చేశాడని సమాచారం. తమిళనాడులోని ఓ బ్యాంకులో చోరీ చేసిన కేసులో అనిల్ ఐదున్నరేళ్ల జైలు శిక్ష అనుభవించాడు. ఆర్మీ నుంచి బయటకు వచ్చిన ఈ 16 ఏళ్లలో ఎనిమిదేళ్లకు పైగా జైలు జీవితాన్ని గడిపాడు. బయట ఉన్న ఎనిమిదేళ్లలో 14 బ్యాంకులలో చోరీలు చేశాడు. మొత్తం 19 కిలోల బంగారాన్ని ఎత్తుకుపోయాడు. ఈ ఏడాది జూన్ 12న జైలు నుంచి బయటకు వచ్చాడు. జూలై 26న హిందూపురం మండలంలోని తూమకుంట చెక్‌పోస్టు వద్ద ఉన్న ఎస్‌బీఐ బ్రాంచిలో చోరీ చేశాడు.

రెండు సెకెన్ల వీడియో పట్టించింది..

జూలై 26వ తేదీ రాత్రి తూమకుంట చెక్‌పోస్టు సమీపంలోని బ్యాంకులో చోరీ జరిగింది. రెండు రోజులు సెలవు ఉండటంతో.. 28వ తేదీన చోరీ వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో పోలీసులకు ఎలాంటి ఆధారాలూ లభించలేదు. భారీ చోరీ కావడంతో అప్పటి ఎస్పీ రత్న, డీఎస్పీ మహేష్, అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సుమారు 15రోజులపాటు కష్టపడ్డారు. చోరీకి ముందు నెలరోజులకు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీలను సేకరించారు. సుమారు 3 వేల వీడియో క్లిప్పింగులను పరిశీలించారు. పది వేల ఫోన్ నంబర్ల వివరాలను ఆరాతీశారు. చివరకు తూమకుంట ప్రాంతంలో రికార్డు అయిన కేవలం రెండు సెకెన్ల వీడియో ఆధారంగా నిందితుడిని గుర్తించారు. 2018లో అనంతపురంలో జరిగిన బ్యాంకు దొంగతనం కేసులో ఉన్న అనిల్ అందులో ఉన్నాడు. ఆ కేసు దర్యాప్తు బృందంలో సీఐ ఆంజనేయులు (అప్పట్లో ఎస్ఐ) ఉన్నారు. దీంతో అతనిపై అనుమానం వచ్చింది. అతని స్వగ్రామంలో ఆధారాలను సేకరించారు. సాంకేతికత ఆధారంగా జూలై 27 నుంచి నెలరోజులపాటు అతని కదలికలను సేకరించారు. ఒకే ఫోన్ నంబరుతో 30మందికి పైగా లాయర్లతో మాట్లాడినట్లు గుర్తించారు. ఆ నంబరు ఆధారంగా కూపీ లాగారు. నాలుగు రోజులపాటు అక్కడే తిష్టవేసి, రేయింబవళ్లు వేటాడి అనిల్‌ను పట్టుకున్నారు.

శాటిలైట్ ఫోన్‌తో..

బ్యాంకు దోపిడీలు చేసి పట్టుబడిన ప్రతిసారీ అనిల్ అప్‌డేట్ అయ్యాడు. పోలీసులు తనను ఎలా పట్టుకున్నారో తెలుసుకుని, పట్టుబడకుండా ఉండేందుకు వినూత్న ఆలోచన చేసేవాడు. తూమకుంట చెక్ పోస్టు వద్ద బ్యాంకులో చోరీకి ఇదేలా ఆలోచించాడు. సెల్‌ఫోన్ వాడితే గుర్తిస్తారని, ఢిల్లీకి వెళ్లి రూ.7 వేలతో శాటిలైట్ ఫోన్ కొనుగోలు చేశాడు. అందులో సిమ్‌కార్డు ఉండదు. నెట్‌వర్క్ సమస్య ఉండదు. ఎక్కడి నుంచైనా మరో సాటిలైట్ ఫోన్‌కు కాల్ చేసే సదుపాయం ఉంటుంది. ఈ కాల్స్‌ను ఎవరూ గుర్తించలేరు. తూమకుంట చెక్‌పోస్టు వద్ద బ్యాంకు చోరీ సమయంలో తాను శాటిలైట్ ఫోన్ వాడానని అనిల్ పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. కోయంబత్తూరు జైలులో పరిచయమైన రాజస్థాన్‌కు చెందిన మరో నిందితుడితో కలిసి తూమకుంట చెక్‌పోస్టులో బ్యాంకు దొంగతనానికి అనిల్ ప్లాన్ వేసి, అమలు చేశాడు. అనిల్ ప్రస్తుతం హిందూపురం సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. రాజస్థాన్‌కు చెందిన మరో నిందితుడిని అక్కడి పోలీసులు వేరే కేసులో జైలులో ఉంచారు. ఇక్కడ చోరీ చేసిన బంగారంలో అధిక శాతం అతనివద్దే ఉన్నట్లు సమాచారం.

చాలా పద్ధతిగా..

బ్యాంకులో చోరీ చేసేందుకు సెలవు రోజులనే అనిల్ ఎంచుకునేవాడు. కనీసం రెండు రోజులు సెలవు ఉన్నప్పుడే చొరబడేవాడు. కుదువ పెట్టిన బంగారాన్ని మాత్రమే ఎత్తుకుపోయేవాడు. పర్సనల్ లాకర్లను టచ్ చేసేవాడు కాదు. తాకట్టు బంగారానికి ఇన్సూరెన్స్ ఉంటుందని, అందుకే ఆ బంగారాన్నే ఎత్తుకుపోయేవాడినని అనిల్ పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది.


సొంతూరు వద్ద పొలంలో దాచిన చోరీ బంగారాన్ని స్వాధీనం చేసుకుంటున్న సీఐ ఆంజనేయులు, పురం వీఆర్వోలు

పశుసంవర్ధక శాఖలో 15 మంది జేడీలకు పోస్టింగ్‌లు

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్ల నుంచి జాయింట్ డైరెక్టర్లుగా తాత్కాలిక పదోన్నతి పొందిన 15మందికి పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పి.ప్రేమ్‌చంద్-అనంతపురం జేడీ, జి.సుబ్బమ్మ- విజయవాడ ఎండీ కాప్, కె.శ్రీనివాసులు-విజయవాడ వీఎస్ఎస్‌హెచ్, ఎం.రత్నజ్యోతి-డైరెక్టరేట్, బి.చంద్రశేఖర్-చింతలదీవి ఎన్‌కేబీసీ, కె.మురళీకృష్ణ-విజయనగరం జేడీ, కె.భూపాల్‌రెడ్డి-డైరెక్టరేట్, డి.శంకరరావు-విశాఖపట్నం జేడీ, ప్రసాదరావు-ఏలూరు జేడీ, వెంకటేశ్వరరావు- ఒంగోలు జేడీ, టి.వి.సుధాకర్-డైరెక్టరేట్, ఉమామహేశ్వరి-చిత్తూరు జేడీ, వి.దుర్గాప్రసన్నబాబు-డైరెక్టరేట్, కెవీవీ సత్యనారాయణ-గుంటూరు జేడీ, పి.వెంకటరమణ-శ్రీకాకుళం జేడీగా నియమితులయ్యారు. కాగా తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నియంత్రణలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు రాయల్ రెడ్డి, శివసాగర్‌రెడ్డిల డిప్యూటేషన్‌ను మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

టమోటా కిలో రూ.16

అనంతపురంరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక టమోటా మార్కెట్‌లో మంగళవారం టమోటా కిలో రూ.16తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.9, సరాసరి ధర రూ.12తో విక్రయాలు జరిగాయని పేర్కొన్నారు. మార్కెట్‌కు 1650 టన్నుల టమోటాలు వచ్చినట్లు తెలిపారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శి మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరిధర రూ.12వేలు పలికాయని వివరించారు. మార్కెట్‌కు మొత్తంగా 548 టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు తెలిపారు.

మళ్లీ వెతలు..!



- జేఎన్‌టీయూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన
- వేతనాల చెల్లింపు బాధ్యతలు ఏజెన్సీకి అప్పగింత
- ఈనెల నుంచే అమలులోకి..
- నేటికీ అందని వేతనాలు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిధిలో వారంతా చిరుద్యోగులు. నెలవారీగా సకాలంలో వచ్చే వేతనాలతో జీవనం నెట్టుకొస్తున్నారు. ఏజెన్సీ అనే మాట వారిపై పిడుగులా పడింది. అభద్రత అనే భయం పుట్టుకొచ్చింది. భవిష్యత్తులో ఎప్పుడు, ఎలాంటి పరిణామాలు చవిచూడాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. జేఎన్‌టీయూ పరిధిలో అవుట్ సోర్సింగ్ కింద వందలాది మంది పనిచేస్తున్నారు. వీరి వేతన చెల్లింపు ప్రక్రియ మళ్లీ ఏజెన్సీ వద్దకు చేరింది. ఈనెల నుంచి కార్తికేయ అనే ఏజెన్సీ ద్వారా ఉద్యోగులకు వేతనాలు చెల్లించనున్నారు. దీంతో సంబంధిత వర్గాల్లో నెలవారిగా వేతన చెల్లింపు, ఉద్యోగ భద్రత, ఇతరత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వేతనాలు సక్రమంగా చెల్లించకపోతే తమ పరిస్థితి ఏంటన్న అభిప్రాయాలు ఆయావర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

600 మందికిపైగా ఉద్యోగులు

జేఎన్‌టీయూలో వివిధ ఉద్యోగాల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించుకున్నారు. పదుల సంఖ్యలో ప్రారంభమైన ఉద్యోగుల సంఖ్య ప్రస్తుతం వందల్లోకి చేరింది. యూనివర్సిటీలో 274, పులివెందుల ఇంజనీరింగ్ కళాశాలో 150, కలికిరి ఇంజనీరింగ్ కళాశాలలో 120, క్యాంపస్ ఇంజనీరింగ్ కళాశాలలో 80, ఓటీపీఆర్ఐలో 26 మంది కలిపి మొత్తం 650 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు.

ఆప్కాస్ నుంచి ఏజెన్సీకి..

అనంతపురం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల నుంచి విశ్వవిద్యాలయం రూపాంతరం చెందిన అనంతరం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఏజెన్సీల ద్వారా చెల్లిస్తుండేవారు. గత ప్రభుత్వం ఆప్కాస్‌ను ఏర్పాటు చేసి, నేరుగా వేతనాలు చెల్లించేది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత జేఎన్‌టీయూ ద్వారా గత నెల వరకు వేతనాలు చెల్లించారు. కోతలు లేకుండా వేతనం మొత్తం ప్రతినెలా రెండు, మూడు తేదీల్లోనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాల్లో జమ అయ్యేది. దీంతో వారికి వేతనం గురించి చింతించాల్సిన అవసరం లేకుండా పోయింది. ప్రస్తుతం మళ్లీ ఏజెన్సీల ద్వారా వేతనాల చెల్లింపునకు చర్యలు మొదలయ్యాయి. దీంతో ఉద్యోగుల్లో ఆందోళనలు నెలకొన్నాయి. ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లిస్తే బాగుంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

నేటికీ అందని వేతనాలు

ఈనెల నుంచి విశ్వవిద్యాలయం పరిధిలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రస్తుత ఏజెన్సీ ద్వారా వేతన చెల్లింపులు ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటి వరకు సదరు ఉద్యోగుల ఖాతాల్లోకి వేతనాలు జమలేదు. దీంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రానున్న రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందో అన్న భయం ఆయా వర్గాల్లో నెలకొంది.

ఉద్యోగులకు ఇబ్బందులు ఉండవు



అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మొదటి నుంచి ఏజెన్సీల ద్వారానే వేతనాలు చెల్లింపులు జరుగుతున్నాయి. ఏజెన్సీలకు వర్సిటీ వేతనాలు చెల్లిస్తుంది. ఉద్యోగులకు ఇబ్బందులు ఉండవు.

- కృష్ణయ్య, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూ

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు బ్రేకులు..!

- వేధిస్తున్న డ్రైవర్ల కొరత
- మరమ్మతులు పట్టించుకోని కాంట్రాక్టు సంస్థ
- చంటిబిడ్డ తల్లులకు తప్పని తిప్పలు

కొత్తచెరువు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి)ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం తరువాత తల్లీబిడ్డను ఇంటికి సురక్షితంగా తీసుకెళ్లే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు బ్రేకులు పడుతున్నాయి. వేతనాలు తక్కువగా ఇస్తుండడంతో డ్రైవర్లు రావట్లేదు. వాహనాలు మరమ్మతుల బారినపడితే చేయించేవారు కూడా లేరు. దీంతో వాహనాలు ఆగిపోతున్నాయి. చంటిబిడ్డ తల్లులు ఇబ్బందులు పడుతున్నారు.

వైసీపీ నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వం వాహనాల నిర్వహణను అరబిందో సంస్థకు అప్పజెప్పింది. కంపెనీకి నిధులు విడుదల చేయకపోవడంతో వాహనాల నిర్వహణ భారంగా మారింది. వాహనాల మరమ్మతులు చేయించలేని, డ్రైవర్లకు సైతం జీతాలు ఇవ్వలేని దుస్థితి తలెత్తిందని సదరు కంపెనీ ప్రతినిధులు వాపోతున్నారు. డ్రైవర్లు కూడా రాకపోవడంతో వాహనాలు చాలా ఆస్పత్రుల్లో నిలిచిపోయాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 36 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఉన్నాయి. వీటిలో అనంతకు 24, శ్రీసత్యసాయి జిల్లాకు 12 కేటాయించారు. అంతపురం సర్వజనాస్పత్రి పరిధిలో 13 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తున్నాయి. 6 వాహనాలు మరమ్మతుల బారిన పడ్డాయి. మిగిలిన వాటిని ఆయా పట్టణాలు, మండలాల్లోని వైద్య కేంద్రాలకు కేటాయించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 12 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు నడుస్తున్నాయి. ఒకటి మాత్రమే మరమ్మతులకు వచ్చింది. మిగిలిన వాటిలో హిందూపురం జిల్లా ఆస్పత్రి పరిధిలో 3, కదిరిలో 2, ముదిగుబ్బ, పెనుకొండ, రొళ్ల, మడకశిర, ధర్మవరం, గోరంట్ల మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున పనిచేస్తున్నాయి.


ధర్మవరం ఆస్పత్రి ఆవరణలో ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్

ఆసక్తి చూపని డ్రైవర్లు

వైసీపీ హయాంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు నెలకు రూ.7,870 చెల్లిస్తుండేవారు. ఆ వేతనానికి పనిచేసేందుకు డ్రైవర్లు ముందుకు రావట్లేదు. దీంతో వాహనాల నిర్వహణ కష్టంగా మారింది. ఈ సమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం డ్రైవర్ల వేతనాన్ని రూ.9,153కి పెంచింది. ఆ జీతం కూడా చాలట్లేదని డ్రైవర్లు అంటున్నారు. కియలో రూ.20 వేలుపైగా వేతనం ఇస్తుండడంతో ఎక్కువ భాగం డ్రైవర్లు ఆ కంపెనీలోని బస్సులకు వెళ్తున్నారు. దీంతో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు డ్రైవర్ల కొరత వెంటాడుతున్నట్లు తెలుస్తోంది.

ఒక్కోసారి ఇద్దరిని..

ఆస్పత్రి నుంచి తల్లీబిడ్డను ఇంటి వద్దకు వదిలిపెడితే రూ.895 అరబిందో సంస్థకు ప్రభుత్వం చెల్లిస్తుంది. జిల్లాలో కొన్నిచోట తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇద్దరేసి తల్లీబిడ్డలను తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకేసారి ఇద్దరిని తరలించి రెండు బిల్లులను ప్రభుత్వం నుంచి కాజేస్తున్నారన్న విమర్శలు వినబడుతున్నాయి. డ్రైవర్లు కూడా చంటిబిడ్డ కుటుంబ సభ్యుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని కొంతమంది బాధితులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో సమస్యలను పరిష్కరించి, తల్లీబిడ్డ వాహనాలను అందుబాటులో ఉంచాలని జనం కోరుతున్నారు.

వాహనాలను వినియోగంలోకి తెస్తాం

ఉమ్మడి జిల్లాలో నిలిచిపోయిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తెచ్చేలా ఇప్పటికే అరబిందో సంస్థతో చర్చించాం. ఒకేసారి వాహనంలో ఇద్దరేసి తల్లీబిడ్డలను తరలించేవారిపై నిఘా పెడతాం. డ్రైవర్లు డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం.

-శంకర్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల జిల్లా కోఆర్డినేటర్

ఆనతినియ్యరా.. స్వామీ..!

గుంతకల్లు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధికి అడుగులుపడ్డాయి. మాస్టర్ ప్లాన్ తయారు కాలేదన్న కారణంగా పుష్కర కాలం కిందట ఆగిన పనులలో కదలిక వచ్చింది. ఆలయంలో ముఖ్యమైన నిర్మాణ కార్యక్రమాలకు అధికారులు స్కెచ్‌లను తయారుచేశారు. కలశాల ఏర్పాటుకు దాతలను సిద్ధం చేసుకున్నారు. వాటి తయారీ అంచనా వ్యయంతో ప్రతిపాదనలను తయారు చేశారు. అసంపూర్తిగా నిలిచిన గోపురాలకు స్వర్ణ కలశాల ఏర్పాటు, కుంభాభిషేకానికి ముహూర్తాన్ని నిర్ణయించారు. దక్షిణాయణ కాలం పూర్తయిన వెంటనే, ఫిబ్రవరిలో స్వర్ణ కలశాల స్థాపన, స్వామివారి ఆలయంలో తొలిసారి కుంభాభిషేకాన్ని నిర్వహించడానికి రంగం సిద్ధం చేశారు. భక్తుల వసతి గదులు, కల్యాణ మండపాలకు మరమ్మతులు చేపట్టారు.

స్కెచ్ సిద్ధం

నెట్టికంటి ఆంజనేయుడి గర్భాలయాన్ని పూర్తిగా రాతితో జీర్ణోద్ధరణ చేసేందుకు స్కెచ్‌ను తయారు చేశారు. రాతి గర్భగుడిని నిర్మించడానికి గుంతకల్లు ఆర్యవైశ్య సంఘం సంసిద్ధతను వ్యక్తంచేసింది. దీంతో అధికారులు ఖర్చు అంచనాలను సిద్ధం చేస్తున్నారు. రాతి గర్భగుడి నిర్మాణానికి రూ.2 కోట్లు అవుతుందని భావిస్తున్నామని, ఆ మొత్తాన్ని సమకూరుస్తామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా జగదీశ్, కార్యదర్శి కృపాకర్ తెలిపారు. ఆలయానికి ఈశాన్యంలో కోనేటిని నిర్మించడానికి పువ్వాడి చంద్రశేఖర్ ముందుకు వచ్చారు. దాదాపు 8 సెంట్ల స్థలాన్ని కానుకగా ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. దీంతో కోనేటి స్కెచ్‌ను, ఖర్చు అంచనాలను అధికారులు తయారు చేస్తున్నారు. ఆలయం లోపల ఉన్న యాగశాలను ప్రస్తుత గోశాల పక్కకు మార్చడానికి, గోశాల స్థలంలో ప్రసాదాల తయారీ షెడ్డును, ప్రసాదాల అమ్మకపు కౌంటర్లను నిర్మించడానికి ప్రతిపాదనలను తయారు చేస్తున్నామని ఈఓ వివరించారు. మరో ఖాళీ స్థలంలో గోశాలను నిర్మిస్తున్నారు. అన్నదాన శాలను పోలీసు చెక్ పోస్టు వద్ద నిర్మించాలని నిర్ణయించారు. అక్కడ ఉన్న (దేవస్థానం ఎదుట) దుకాణాలను వేరేచోటుకు తరలిస్తామని ఈఓ తెలిపారు.

గదులకు మరమ్మతులు

ఆలయంలో సమస్యాత్మకంగా మారిన వసతి గదుల మరమ్మతులను చేపట్టారు. ఆలయానికి తూర్పున ఉన్న ఏసీ కాటేజీ మరమ్మతులు జరుగుతున్నాయి. వీటికి ఆనుకుని ఉన్న గంగా నిలయం కల్యాణ మండపానికి మరమ్మతులను పూర్తిచేసి, రంగులు వేస్తున్నారు. ఆలయానికి ఎదురుగా ఉన్న కేసరి సదనానికి త్వరలో మరమ్మతులు చేపట్టనున్నారు. బెంగళూరుకు చెందిన ఓ దాత 55 గదులతో వసతి సముదాయాన్ని నిర్మించడానికి ముందుకు వచ్చారని ఈఓ తెలిపారు.

దాతలతోనే అభివృద్ధి..

ఆలయానికి ఆదాయం కంటే వ్యయం అధికంగా ఉంటోంది. దేవస్థానానికి హుండీలు, కౌలు, అద్దెలు, టిక్కెట్లు తదితరాల ద్వారా రూ.12 కోట్ల ఆదాయం వస్తోంది. కానీ అంతకు మించి జీతాలు, ప్రసాదాల తయారీ, చట్టపరమైన చెల్లింపులకు ఖర్చు అవుతోంది. అభివృద్ధి జరగాలంటే దాతల వల్ల మాత్రమే సాధ్యమౌతుంది. అందుకే వారి సహాయాన్ని అర్థించాము. నెలలోనే దాతల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. తొలుత బంగారు కలశాల ఏర్పాటు, కుంభాభిషేకం సంకల్పించాము. దాతల ఆసక్తిమేరకు చెప్పిన అభివృద్ధి కార్యక్రమాలన్నీ చేపడతాం. భక్తుల వసతికి తొలి ప్రాధాన్యం ఇస్తాం.

-విజయరాజు, ఈఓ, కసాపురం దేవస్థానం

అమరావతికి నూతన టీచర్లు

- జిల్లా నుంచి 45 బస్సుల ఏర్పాటు
- రేపు ఉదయం 6 గంటలకు పీవీకేకే కళాశాలకు చేరుకోవాలి
- 19న సీఎం, విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు
- డీఈఓ ప్రసాద్‌బాబు


మాట్లాడుతున్న డీఈఓలు ప్రసాద్‌బాబు, క్రిష్టయ్య

అనంతపురం విద్య, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో టీచర్ ఉద్యోగాలు సాధించిన వారందరూ అమరావతికి బయల్దేరాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారి క్రిష్టయ్య, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు, డీఎస్సీ సెక్షన్ ఏడీ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ ఆదినారాయణతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. డీఎస్సీలో 755 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వారందరికీ అమరావతిలో నియామక పత్రాలు అందజేస్తారన్నారు. ఈనెల 18వ తేదీన ఉదయం 6 గంటలకు అనంతపురంలోని ఆలమూరు రోడ్డులోగల పీవీకేకే కళాశాలకు అభ్యర్థులు చేరుకోవాలన్నారు. అభ్యర్థితోపాటు కుటుంబ సభ్యుడు ఒకరు తప్పకుండా రావాల్సి ఉంటుందన్నారు. జోనల్‌లో పీజీటీ, టీజీటీ పోస్టులకు ఎంపికై జిల్లాలో ఉన్నవారు కూడా ఇక్కడికే రావాల్సి ఉంటుందన్నారు. 45 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19వ తేదీ అమరావతిలో సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తారన్నారు. ఈనెల 22 నుంచి 29వ తేదీ వరకు అభ్యర్థులకు ఆయా సబ్జెక్టుల్లో జిల్లాలోనే శిక్షణ ఇస్తామన్నారు. ఆ తర్వాత పాఠశాలలకు పోస్టు కేటాయించి, పంపుతామని డీఈఓ ప్రసాద్‌బాబు వివరించారు.

డీఎస్సీలో మరో మాయ..!

అనంతపురం విద్య, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాల ప్రక్రియలో మాయలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పదేపదే సర్టిఫికెట్ల పరిశీలన చేసినా.. ఎంపిక జాబితాలో అనర్హులకు చోటు కల్పించడం, అర్హుల పేర్లు లేకపోవడం వ్యవహారాలు బయట పడుతున్నాయి. బుద్ధిమాంద్యం (ఎంఐ) కేటగిరీలో ఓ అభ్యర్థి అనర్హుడు అని వైద్యుడు సర్టిఫికెట్ ఇచ్చారు. దానిని కూడా విద్యాశాఖాధికారులే తీసుకొచ్చారు. అయినా ఆ అభ్యర్థికి ఎంఐ కేటగిరీ కింద సోషల్ సబ్జెక్టులో ఎంపిక చేసిపంపారు. ఆయన పేరును చూసి విద్యాశాఖ యంత్రాంగమే నివ్వెరపోయింది. అది మరువకనే డీఎస్సీ ఎంపిక జాబితాలో అర్హత ఉన్న ఓ అభ్యర్థికి పోస్టు దక్కలేదు. ఆయన కన్నా తక్కువ మార్కులు వచ్చిన వారికి పోస్టింగ్ కల్పించి, ఎంపిక జాబితాలో పెట్టారు. ఇది వెలుగులోకి రావడంతో విద్యాశాఖ అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

అర్హత ఉన్నా.. పేరు మాయం..

ధర్మవరానికి చెందిన ఏ ఆంజనేయులు (బీసీ-ఏ) డీఎస్సీ రాశారు. ఆయనకు రాష్ట్రశాఖ నుంచి వెరిఫికేషన్‌కు హాజరుకావాలని కాల్‌లెటర్ వచ్చింది. పరిశీలనకు డిగ్రీలకు సంబంధించి అన్ని సర్టిఫికెట్లు ఒరిజనల్ ఉన్నా.. సెకండ్ డిగ్రీకి సంబంధించిన మార్కుల మెమో ఒరిజినల్ తీసుకురాలేదు. దీంతో ఆయన పరిశీలనను పెండింగ్‌లో ఉంచి ఒరిజినల్ డిగ్రీ మార్కుల మెమో తీసుకురావాలని చెప్పడంతో వెనుదిరిగి వెళ్లారు. ఆ తర్వాత తాను చదివిన ఎస్వీ యూనివర్శిటీకి వెళ్లి ఒరిజినల్ మార్కుల మెమో కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 5వ తేదీన తిరిగి డీఈఓ కార్యాలయం నుంచి ఆంజనేయులుకు ఫోన్ చేసి, సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు. 8వ తేదీన ఆయన యూనివర్సిటీలో ఒరిజినల్ మార్కుల మెమో తీసుకుని, రాత్రికి డీఈఓ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అధికారులు ఇళ్లకు వెళ్లిపోవడంతో 9వ తేదీ ఉదయమే మళ్లీ డీఈఓ కార్యాలయానికి వచ్చి ఒరిజినల్ సర్టిఫికెట్లను అందజేశారు. అదేరోజే వాటిని పరిశీలించిన కమిటీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి పంపింది. డీఎస్సీ ఎంపిక జాబితాలో ఆయన పేరులేదు. ఆయన కన్నా తక్కువ మార్కులు వచ్చిన వారి పేర్లు జాబితాలో ఉన్నాయి. ఆంజనేయులు డీఎస్సీ ఇంగ్లిష్ సబ్జెక్టులో 76.28 మార్కులు సాధించి 48వ ర్యాంకులో ఉన్నారు. ఈ సబ్జెక్టులో ఎంపిక జాబితా ఆధారంగా 75.73 మార్కులతో 49వ ర్యాంకులో ఉన్న ధనుంజయ అనే అభ్యర్థి వరకు ఓపెన్ కేటగిరీలోనే ఎంపికయ్యారు. ధనుంజయ కంటే ఆంజనేయులుకు ఎక్కువ మార్కులు ఉన్నాయి. ర్యాంకు 48 కాబట్టి ఆంజనేయులు ఇంగ్లిష్‌లో ఓపెన్ విభాగంలోనే ఎంపికకావాల్సి ఉంది. అయినా.. ఆయన పేరు కనిపించలేదు. బీసీ-ఏ కేటగిరీలో ఆంజనేయులు కంటే తక్కువ మార్కులు ఉన్నవారికి పోస్టింగ్ ఇచ్చారు. ఆంజనేయులు పేరు మాత్రం జాబితాలో లేదు. దీంతో ఆయన.. డీఈఓ కార్యాలయానికి వచ్చి, విద్యాశాఖ అధికారులను కలిసి తనకు వాటిల్లిన అన్యాయాన్ని వివరించారు. అర్హుడిని పోస్టుకు ఎంపిక చేయకుండా విద్యాశాఖ మాయాజాలం ప్రదర్శించడం విమర్శలకు తావిస్తోంది.

ఉన్నత విద్యామండలిలో ఇద్దరు వైస్ చైర్మన్ల నియామకం

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలిలో రెండు వైస్ చైర్మన్ పోస్టులను భర్తీ చేస్తూ ఉన్నత విద్యాశాఖ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. వైస్ చైర్మన్-1గా శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావును, వైస్ చైర్‌పర్సన్-2గా నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ రత్నశీల మణిని నియమించింది. వీరి పదవీ కాలం మూడేళ్లు. గత ప్రభుత్వం నియమించిన ఇద్దరు వైస్ చైర్మన్లలో ఒకరి పదవీకాలం ఇటీవల ముగియగా, మరొకరు రాజీనామా చేశారు. ఆయా స్థానాలను కూటమి ప్రభుత్వం ఇప్పుడు భర్తీ చేసింది.

1,482 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా




అనంతపురం అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1,482 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద వ్యాగిన్లలో వచ్చిన యూరియా బస్తాలను ఏడీఏ మంగళవారం పరిశీలించారు. ఏపీ మార్క్‌ఫెడ్‌కు 899, ప్రైవేటు డీలర్లకు 583 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తామన్నారు. 900 మెట్రిక్ టన్నుల వైట్ పొటాష్ సరఫరా వచ్చిందన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

పెరియార్ ఈవీ రామస్వామి (జయంతి)



నాస్తికవాది, సంఘసంస్కర్త పెరియార్ ఈరోడ్ వేంకట రామస్వామి 1879 సెప్టెంబరు 17న ఈరోడ్ పట్టణంలో జన్మించారు. ఈయన పెరియార్‌గా, తంథై పెరియార్‌గా, రామస్వామిగా, ఈవీఆర్‌గా ప్రసిద్ధులు. తమిళనాడులో ఆత్మగౌరవ ఉద్యమం, ద్రావిడ ఉద్యమ నిర్మాతగా పేరొందారు. తమిళ సమాజంలో ప్రబలంగా ఉన్న కుల మనోభావాలు, మూఢనమ్మకాలను పెకిలించి వేయాలనుకున్నాడు. మూఢనమ్మకాలపై పోరాడేందుకు నల్లచొక్కాను ఎంచుకున్నాడు. అంటరానితనాన్ని రూపుమాపేందుకు కృషి చేశారు. 1930-1940 దశకాలలో తమిళ ప్రజలపై హిందీని రుద్దడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 1973 డిసెంబరు 24న కన్నుమూశారు. కాగా పెరియార్ జయంతిని 2021లో సామాజిక న్యాయ దినోత్సవంగా తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది.

ఎంఎఫ్ హుసేన్ (జయంతి)




దేశం గర్వించదగిన ప్రముఖ చిత్రకారులలో ఒకరైన మక్బూల్ ఫిదా హుసేన్ (ఎంఎఫ్ హుసేన్) 1915 సెప్టెంబరు 17న జన్మించారు. బాంబే ప్రోగ్రెసివ్ ఆర్టిస్ట్ గ్రూప్ సంస్థాపక సభ్యులలో ఒకరు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, రాజారవివర్మ అవార్డు, ఆదిత్య విక్రమ్ బిర్లా వారి కళాశిఖర్ అవార్డు, మైసూరు, కాలికట్ యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

శివరాజు సుబ్బలక్ష్మి (జయంతి)



శివరాజు సుబ్బలక్ష్మి 1925 సెప్టెంబరు 17న తాపేశ్వరంలో జన్మించారు. ప్రముఖ రచయిత్రి, చిత్రకారిణి. తన రచనలకు భర్త బుచ్చిబాబు (శివరావు వెంకట సుబ్బారావు) స్ఫూర్తినిచ్చారు. ఆమె కథలు అనేక సంకలనాలలో వెలువడ్డాయి. గృహలక్ష్మి స్వర్ణ కంకణం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం, ఇతర గౌరవాలు అందుకున్నారు. 2021 ఫిబ్రవరి 6న కన్నుమూశారు.

లాల్గుడి జయరామన్ (జయంతి)



ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు, పద్మభూషణ్ గ్రహీత లాల్గుడి జయరామన్ 1930 సెప్టెంబరు 17న తమిళనాడులో జన్మించారు. వాగ్గేయకారులుగా, శృతికర్తలుగా, కర్ణాటక సంగీత వయోలినిస్ట్‌గా పేరొందారు. ఎంఎస్ గోపాలకృష్ణన్, టీఎన్ కృష్ణన్, లాల్గుడి జయరామన్‌లతో కలసి వయోలిన్ త్రయంగా పేరొందారు. ఆయన స్వరపరిచిన తిల్లానలు, వర్ణాలు చాలా ప్రసిద్ధి చెందాయి. తమిళం, తెలుగు, కన్నడ, సంస్కృతం నాలుగు భాషలలోనూ స్వరాలను శృతి పరిచారు. భరతనాట్య నృత్య ప్రదర్శనలలో చాలావరకు ఆయన కృతులే వాడబడతాయి. 2013 ఏప్రిల్ 22న కన్నుమూశారు.

నరేంద్రమోదీ (పుట్టినరోజు)



ప్రధానమంత్రి నరేంద్రమోదీ 1950 సెప్టెంబరు 17న జన్మించారు. 2014 నుంచి వరుసగా మూడోసారి ప్రధానిగా కొనసాగుతున్నారు. అంతకుముందు 2001 నుంచి 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. వారణాసి నుంచి ఎంపీగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు. కాంగ్రెసేతర ప్రధానిగా అటల్ బిహారి వాజ్‌పేయి తర్వాత పూర్తిస్థాయి మెజారిటీ కల్గిన ప్రధాని కావడం విశేషం. మారిషస్ దేశం నుంచి 'గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ అండ్ కీ' గౌరవం, శ్రీలంక దేశం నుంచి 'శ్రీలంక మిత్ర విభూషణ్' గౌరవం అందుకున్నారు. కాగా ఆయన పలు పుస్తకాలు కూడా రచించారు.



బేలూరు వద్ద ఉల్లి పొలంలో మేకలు



మొలకలు వచ్చిన ఉల్లిపాయలు

మేకలకు ఆహారంగా ఉల్లిపంట

కంప్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. దిగుబడి సంతృప్తిగా ఉన్నా ధరలు మాత్రం పాతాళానికి పడిపోయాయి. ఈ ధరలకు అమ్మితే కనీసం పెట్టుబడులు కూడా రావని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరకు సేంద్రీయ ఎరువైన అవుతుందని పంటను గొర్రెలు, మేకకు వదిలేస్తున్నారు. తాలుకా పరిధిలోని బేలూరు గ్రామానికి చెందిన దేవప్ప కురుబ రైతు తన మూడు ఎకరాల భూమిలో పండించిన ఉల్లి పంటకు మార్కెట్లో సరైన ధర లభించకపోవడంతో కోయకుండానే పొలంలోనే వదిలేశారు. పంటను తెంచి, మార్కెట్‌కు తరలించినా గిట్టుబాటు ధర రాదని, అందుకే పశువులకు వదిలేశామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండనక వాననక కష్టపడి పండించిన పంటలకు మార్కెట్లో గిట్టుబాటు రేట్లు లేకపోతే అప్పులు కట్టలేక ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇస్తున్నారు. కానీ మార్కెట్లో తీసుకెళ్లే పంటలకు మాత్రం ప్రభుత్వాలు గిట్టుబాటు రేట్లు కల్పించకపోవడంలో విఫలం అవుతున్నారని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దరాభారంతో పాటు మధ్యవర్తులు కూడా ముంచేస్తున్నారని రైతులు వాపోతున్నారు. పంటలకు వేసే పిచికారి మందులు రసాయనానికి ఎరువులు, కూలీల రేట్లు పెరుగుతూనే ఉన్నాయన్నారు. రైతులు పండించిన పంటలకు మాత్రం రేట్లు లభించలేకపోతుందన్నారు. గిట్టుబాటు ధరలు లేక వ్యవసాయం వదిలి కూలీ పనులకు పోతున్నామని రైతులు అంటున్నారు. ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో తమకు ఏ సమస్య వచ్చినా తాము మీ వెంటే వుంటూ మీ సమస్యలన్నీ తమ సమస్యలుగా భావించుకుని పరిష్కరిస్తామని తెలిపి చివరకు రైతు ఇన్ని కష్టాలు పడుతున్నారు. ఇటువైపు కూడా చూడలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలే లేక అల్లాడుతుంటే వర్షాలు మరింత నష్టాన్ని కలుగజేశాయని రైతులు వాపోతున్నారు.

బీసీ కులాలను అవమానపరిచే కుట్ర

బెంగళూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బీసీ కులాలను అవమానం చేసేందుకు ప్రభుత్వం కుట్రపన్నిందని సామాజిక న్యాయ జాగృతి వేదిక ప్రతినిధులు మండిపడ్డారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో వివిధ వెనుకబడిన కులాల ప్రతినిధులు భాగస్వామ్యులయ్యారు. కులగణన పేరుతో వెనుకబడిన కులాలకు అనుబంధంగా క్రిస్టియన్ చేర్చడం సరికాదన్నారు. క్రిస్టియన్ అనేది ప్రత్యేక మతమని కానీ బీసీ కులాలకు ఏవిధంగా అనుసంధానం చేస్తారన్నారు. వెంటనే ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి కులానికి అనుబంధంగా క్రిస్టియన్ అనేది ఎలా చేస్తారన్నారు. అనంతరం రాజభవన్‌కు వెళ్లిన వేదిక ప్రతినిధులు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మైసూరు మాజీ ఎంపీ యదువీర్, మాజీ ఎమ్మెల్సీ రఘుకౌటిల్య, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వివిధ కులాల ప్రతినిధులు

టీచర్లపై యాప్‌ల భారం తగ్గించాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న కాడిశెట్టి శ్రీనివాసులు

స్కూల్ టీచర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి

మడకశిర టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు అన్నారు. ఆయన మంగళవారం మడకశిర మండలంలో పర్యటించారు. పట్టణంలోని ఎంఆర్‌సీలో జిల్లా సబ్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యా యులను బోధనకే పరిమితం చేయాలన్నారు, ఇతర బాధ్యతల వల్ల పాఠ్యాంశాల బోధనకు సమయం సరిపోవడం లేదన్నారు. 2023 జూలై నుంచి 12వ వేతన సవరణ అమలు చేయాల్సి ఉండగా నేటికి పీఆర్సీని నియమించకపోవడం దారుణమన్నారు. ఎన్నికలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బేగార్లపల్లి పాఠశాలతో పాటు మండలంలో పలు పాఠశాలలు ప ర్యటించి సభ్యత్వ నమోదు నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.క్రిష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు మారుతీప్రసాద్, జిల్లా కోశాధికారి ప్రదీప్‌కుమార్, నాయకులు రమేష్, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వివక్షను ఎదుర్కొని.. ఆదర్శంగా ఎదిగారు

- పూలే దంపతుల అడుగుజాడల్లో నడుద్దాం: ఎంపీ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పూలే దంపతులు వివక్షను ఎదుర్కొని, ఆదర్శంగా ఎదిగారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వారి అడుగుజాడల్లో నడుద్దామని పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలోని జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ.. సావిత్రీబాయి పూలే టీచర్‌గా ఎన్నో అడ్డంకులను అధిగమించి, సమాజం కోసం పోరాటం చేశారని గుర్తుచేశారు. ఆమెకు జ్యోతీబాయి పూలే పూర్తి సహకారం అందించారన్నారు. బీసీలకు 43 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న దానిపై చర్చ జరుగుతోంది. అది అమలైతే బీసీలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల వారికి సమాన అవకాశాలు కల్పించాలని పూలే దంపతులు పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జాయింట్ కలెక్టర్లు శివనారాయణశర్మ, అభిషేక్ కుమార్, జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

ప్రాణం పోతున్నా ప్రయాణికులను కాపాడారు

బెంగళూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రాణం పోతున్నా ప్రయాణికులను కాపాడాలని పరితపించాడు ఆ బస్సు డ్రైవర్. ఛాతి నొప్పితో విలవిలలాడుతున్నా బస్సును రోడ్డు పక్కనే ఆపి ఎటువంటి ప్రమాదం జరగకుండా చూశారు. నెలమంగళ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఈ సంఘటన చోటు చేసుకుంది. కేఎస్ఆర్టీసీ రాజహంస బస్సు నడుపుతూ వెళుతున్న డ్రైవర్ రాజీవ్ బిరాదార్(50)కు ఛాతీలో తీవ్రమైన నొప్పి వచ్చింది. జాతీయ రహదారిపై వెళుతున్నందున డ్రైవర్ ఆచితూచి వ్యవహరించారు. జాస్ టోల్‌గేట్ సమీపంలో రోడ్డు పక్కన ఒక్కసారిగా బస్సును ఆపేశారు. వెంటనే డ్రైవర్ సీటులోనే కుప్పకూలిపోయారు. గమనించిన ప్రయాణీకులు అంబులెన్స్‌కు ఫోన్‌చేశారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది పరీక్షించి అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిపారు. బస్సు బెంగళూరు నుంచి చిత్రదుర్గ జిల్లా హరిహరకు వెళ్తోంది. ప్రయాణీకుల సమాచారంతో వెంటనే నెలమంగళ ప్రాంతం నుంచి ఆర్టీసీ అధికారులు అక్కడికి చేరుకుని డ్రైవర్ బిరాదార్‌ను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ బిరాదార్ ఉత్తరకర్ణాటకకు చెందినవారుగా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ప్రయాణీకులను ఇతర బస్సులలో పంపారు. డ్రైవర్ మృత్యువులోను మానవత్వం చూపారంటూ పలువురు ప్రయాణికులు అభిప్రాయపడ్డారు.

ఓవర్‌టేక్

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయడానికి వెళ్ళిన ఓ ప్రైవేట్ బస్సు ప్రమాదానికి గురయ్యింది. మంగళవారం తెల్లవారుజామునన విజయనగర జిల్లా, కూడ్లిగి తాలూకా, బిష్ణహళ్ళి వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మనోజ్(28), సురేష్(45) అను ఇద్దరు మృతి చెందారు. ముదగల్ నుంచి బెంగళూరు వైపు వెళుతున్న సుగమ సంస్థకు చెందిన ప్రైవేట్ బస్సు డ్రైవర్ బిష్ణహళ్ళి వద్ద ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించారు. అదుపు తప్పిన బస్సు లారీని బలంగా ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికులు తీవ్రగాయాలతో అక్కడికక్కడే కన్ను మూశారు. మరో 8మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని సునిల్, బాబాజన్, విశ్వేశ, హనుమనగౌడ, మంజునాథ్, అరుణ్, సయ్యద్‌గా గుర్తించారు. మరో ఇద్దరి పేర్లు తెలియరాలేదు. ప్రమాదంలో బస్సు ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. ఘటనా స్థలానికి జిల్లా ఎస్పీ జాహ్నవి, కూడ్లిగి డీవైఎస్పీ మల్లేష్ దొడ్డమని, కొట్టూరు సీపీఐ దురుగప్ప, కానాహొళ్ళి పీఎస్ఐ సిద్ధరామ బిదరాణి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఘటనకు కారణమైన బస్సు డ్రైవర్‌పై కానాహొసళ్ళి పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదంపై విచారణ చేపట్టారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

- హాస్టల్ గదిలో చున్నీతో ఉరి

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోటరీపురం సమీపంలోని ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థిని కె. ధనలక్ష్మి(21) ఆత్మహత్యకు పాల్పడింది. కాలేజీ హాస్టల్ గదిలో మంగళవారం ఉరి వేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు, పెనుకొండ పట్టణంలోని ఒగ్గప్పకుంట కాలనీకి చెందిన నాగరాజు కూతురు ధనలక్ష్మి. సీఎస్ఈ తృతీయ సంవత్సరం చదువుతోంది. కాలేజీ ఎన్‌సీసీ శిక్షణలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పాల్గొంది. సాయంత్రం నాలుగన్నర గంటలకు హాస్టల్ గదికి వెళ్లి.. చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఆ సమయంలో సహ విద్యార్థినులు స్నాక్స్ కోసం వెళ్లారు. వారు తిరిగి వచ్చి గది తలుపులు తట్టినా ధనలక్ష్మి స్పందించలేదు. దీంతో కాలేజీ సిబ్బందిని పిలిపించి, తలుపులను బద్దలు కొట్టారు. అప్పటికే ధనలక్ష్మి మృతి చెందింది. సీఐ పుల్లన్న, ఎస్ఐ రాంప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కళాశాల సిబ్బందిని, విద్యార్థులను విచారించారు. గదిలో సూసైడ్ నోట్ ఉందేమోనని పరిశీలించారు. ధనలక్ష్మి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాల్‌డేటాను సేకరించారు. సెల్‌ఫోన్ లాక్ అయిందని, సాంకేతిక నిపుణుల చేత ఓపెన్ చేయించి, వివరాలు సేకరిస్తామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడికి చేరుకున్న ధనలక్ష్మి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం కాలేజీ హాస్టల్ గదికి వెళ్లి పరిశీలించారు. తన కూతురు మృతికి కారణం ఏమిటో తెలియదని, ఈనెల 13 వరకూ ఇంటి వద్ద ఉండి, కాలేజీకి వచ్చిందని విద్యార్థిని తండ్రి నాగరాజు పోలీసులతో అన్నారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ధనలక్ష్మి (ఫైల్)

ఆకట్టుకున్న హరివిల్లు

కంప్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఉభయ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. మంగళవారం కంప్లి పట్టణంలో వర్షం కురుస్తూనే ఉంది. సాయంత్రం వర్షం నిలిచిన తర్వాత ఏర్పడిన ఇంద్రధనుస్సు విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులు ఇంద్రధనస్సును సెల్‌ఫోన్లతో ఫొటోలు తీస్తూ హర్షం వ్యక్తం చేశారు. మారమ్మనహళ్లి, హగరి, బొమ్మనహళ్లి పట్టణాల్లో వర్షాలు జోరు వానలు కురిశాయి.

క్రీడాపోటీలు వాయిదా

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం నుంచి నిర్వహించాల్సిన క్రీడాపోటీలు అనివార్య కారణాలతో వాయిదావేసినట్లు స్కూల్ గేమ్స్ సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. 17న వెయిట్ లిఫ్టింగ్, సాఫ్ట్ టెన్నిస్, స్కేటింగ్, 18న జూడో, కురాష్, టేబుల్ టెన్నిస్, 19న రెజ్లింగ్, తైక్వాండో పోటీలు జరగాల్సి ఉందన్నారు. మెగా డీఎస్సీ అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేసే కార్యక్రమం రాజధాని అమరావతిలో నిర్వహించనున్న నేపథ్యంలో పోటీలు వాయిదా వేశామన్నారు. తదుపరి తేదీలు, వివరాలకు 7989737474 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు అర్చకుల సమావేశం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో బుధవారం అర్చకుల సమావేశం నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అసిస్టెంట్ కమిషనర్లు హాజరవుతారన్నారు. అర్చకుల సమస్యలపై చర్చిస్తారని తెలిపారు.

దొంగల స్వైరవిహారం

రొద్దం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి దొంగలు స్వైరవిహారం చేశారు. రెండు ఆలయాలు, ఇంట్లోకి చొరబడ్డారు. మండలంలోని సుబ్బరాయప్పకొట్టాల గ్రామ సమీపంలో ఉన్న పూజమ్మ దేవాలయం తాళాలు పగలకొట్టి అందులో చొరబడ్డారు. 3 కిలోల వెండి, రూ.30 వేల నగదు చోరీ చేశారు. పెన్నానది ఒడ్డున ఉన్న సాయిబాబా ఆలయంలోకి చొరబడి బీరువాను పగులకొట్టారు. అందులో ఏమీ దొరకలేదు. పక్కనే ఉన్న కుర్లపల్లి అంజినరెడ్డి ఇంటి తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించి, బీరువాను ధ్వంసం చేశారు. ఏమీలేకపోవడంతో వెనుదిరిగారు. అటునుంచి పెన్నానది గట్టున మొక్కజొన్న యంత్రంలో ఉన్న టూల్ కిట్స్ జాకీని ఎత్తుకెళ్లారు. ఉదయం సమాచారం అందుకున్న ఎస్ఐ నరేంద్ర ఆలయంలో క్లూస్ టీమ్‌తో తనిఖీ చేశారు.

అర్హులందరికీ పథకాలు

- ఆధారాలతో వస్తే న్యాయం
- జడ్పీ సమావేశంలో ఎంపీ అంబికా
- ఆర్డీటీ అంశంపై చైర్‌పర్సన్‌తో వాగ్వాదం
- వైద్యం, యూరియా సమస్యలను లేవనెత్తిన సభ్యులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. అర్హత ఉండి పథకాలు అందనివారు తగిన ఆధారాలతో వస్తే న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరికి 'తల్లికి వందనం' సొమ్ము జమ కాలేదని, విద్యాశాఖ అధికారులు సమాధానం ఇవ్వాలని సభ్యులు డిమాండ్ చేయడంతో ఎంపీ స్పదించారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. సమావేశానికి ఎమ్మెల్సీ మంగమ్మ, జేసీలు శివనారాయణ శర్మ, అభిషేక్ కుమార్, జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. చైర్ పర్సన్ గిరిజమ్మ సర్వసభ్య సమావేశాన్ని ప్రారంభించారు. జిల్లాలో విద్య, వైద్య శాఖ ప్రగతిని వివరించాలని అధికారులకు సూచించారు. ఈ లోగా తల్లికి వందనం గురించి సభ్యులు నిలదీశారు. ఉమ్మడి జిల్లాలో ఎంత మంది అర్హులున్నారు, ఎంత మంది తల్లుల ఖాతాలో సొమ్ము జమ అయిందీ చెప్పాలని బుక్కరాయసముద్రం జడ్పీటీసీ భాస్కర్ తదితరులు డిమాండ్ చేశారు.

రైతులను ఆదుకోవాలి: గిరిజమ్మ

ఉమ్మడి జిల్లాలో రైతులను పాలకులు ఆదుకోవాలని చైర్ పర్సన్ గిరిజమ్మ కోరారు. యూరియా సరఫరా, మొక్కజొన్న కొనుగోలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సభ్యులు కోరగా, ఆమె స్పందించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపడుతున్నారని ప్రశ్నించారు. మార్కెటింగ్ శాఖ అదే పనిమీద ఉందని జేడీఏ ఉమామహేశ్వరమ్మ అన్నారు. 'పని మీద ఉండటం కాదు.. వెంటనే కొనుగోలు చేసేలా చూడండి' అని గిరిజమ్మ సూచించారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏని పునరుద్ధరించేలా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని గిరిజమ్మ అన్నారు. ఆర్డీటీ సమస్యను పలువురు సభ్యులు సభలో ప్రస్తావించారు. సభలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని జడ్పీటీసీ నాగరాజు పట్టుబట్టారు. ఇప్పటికే ఒకసారి తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించామని, అయినా అమలు కాలేదని చైర్ పర్సన్ అన్నారు. మరోసారి తీర్మానం చేసి పంపుదామని అన్నారు. ఈ అంశంపై ఎంపీ అంబికా, చైర్ పర్సన్ గిరిజమ్మ మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. ఈ సమస్య 2023లోనే తలెత్తిందని, అప్పటికే ఖాతాలు సీజ్ చేశారని అన్నారు. తమ ప్రభుత్వం ఎర్పడిన తరువాత కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాతో చర్చలు జరిపామని ఎంపీ అంబికా అన్నారు. కొత్త ఖాతాలను ప్రారంభించడానికి కొంత సమయం పడుతుందని, ఆ ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. వీలైనంత త్వరగా పూర్తి అవుతుందని, ఆర్డీటీకి పూర్వ వైభవం తెస్తామని అన్నారు.



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న జడ్పీటీసీలు

మేమేం ఉన్నోళ్లం కాదు..

'నిధులు లేవు.. విధులు లేవు. పేరుకే ప్రజాప్రతినిధులం. మా మాట చెల్లుబాటు కావడం లేదు. మూడేళ్ల నుంచి గౌరవ వేతనం ఇవ్వడం లేదు. ఇతర రాష్ట్రాలలో రూ.13 వేల గౌరవ వేతనం ఇస్తున్నారు. ఇక్కడ ఇస్తారా..? లేదా..?' అని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీటీసులు అందరూ ఆర్థికంగా ఉన్నవారేనని అనుకోవద్దని అన్నారు. గౌరవ వేతనం ఇవ్వకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. కావాలంటే జడ్పీటీసీ, ఎంపీటీసీ వ్యవస్థలను రద్దు చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్యశాలలో ఆకతాయిలు..

ప్రభుత్వ వైద్యశాలలో ఆకతాయిలు వైద్య విద్యార్థులను వేధిస్తున్నారని కొందరు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వెళితే వైద్య పరీక్షలన్నీ బయటకు రాయిస్తున్నారని అన్నారు. ఆదివారం వస్తే సొంత క్లినిక్‌లకు వెళ్లి పేదలను దోచుకుంటున్నారని అన్నారు. గుమ్మఘట్ట ఎంపీడీఓ ప్రొటోకాల్ పాటించడం లేదని ఎంపీపీ సభ దృష్టికి తెచ్చారు. అనంతపురం రూరల్ మండలంలో అనామకుల చేత ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని జడ్పీటీసీ చంద్రమోహన్ సభ దృష్టికి తెచ్చారు., తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో ఎంపీ అంబికా, చైర్ పర్సన్ గిరిజమ్మ, జేసీ శివనారాయణ శర్మ



ఎంపీ, జడ్పీ చైర్‌పర్సన్ వాగ్వాదం

డీఈఓ లేరని..

తల్లికి వందనం వివరాలను వెల్లడించాలని చైర్ పర్సన్ సూచించారు. కానీ డీఎస్సీ నియామక ప్రక్రియలో బిజీగా ఉన్న డీఈఓ ప్రసాద్ బాబు సభకు హాజరు కాలేదు. తమకు వివరాలు తెలియవని కార్యాలయ సిబ్బంది అన్నారు. దీంతో సభ్యులు కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను ఒక జడ్పీటీసీ. నాకు ఇద్దరు పిల్లలు. జడ్పీ పాఠశాలలోనే చదువుతున్నారు. అయినా తల్లికి వందనం పడలేదు. కారణం ఏమిటి..? బాధ్యులు ఎవరు..? నేనే జడ్పీటీసీ అయినందుకే సొమ్ము జమకాలేదా..? సభ జరిగిన ప్రతిసారీ ఈ సమస్యను లేవనెత్తుతున్నాం. అధికారులు తప్పించుకు తిరుగుతున్నారు..' అని జడ్పీటీసీ భాస్కర్ అన్నారు. జేసీ శివనారాయణ శర్మ జోక్యం చేసుకుని, వివరాలు చెప్పే ప్రయత్నం చేయ దంలో చైర్ పర్సన్ గిరిజమ్మ అడ్డుకున్నారు. 'అన్ని వివరాలను మీరే చెబితే ఇక మిగిలిన అధికారులు ఎందుకు..?' అని ప్రశ్నించారు. డీఈఓ రాలేకపోయారని, సిబ్బందికి అవగాహన లేనందున తానే చెబుతానని జేసీ అన్నారు. నిబంధనల మేరకు ఆదాయ పన్ను చెల్లించేవారికి, ప్రభుత్వ ఉద్యోగులకు తల్లికి వందనం వర్తించదని అన్నారు. అర్హత ఉండి రాకపోతే ఆధారాలను విద్యాశాఖ అధికారులకు ఇవ్వాలని సూచించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10.524	18,737
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,268	18,137
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77

బియ్యం బస్తాతో అంజనాద్రి ఎక్కి
మొక్కు తీర్చుకున్న యువతి



బియ్యం బస్తాతో కొండపైకి వెళ్తున్న విద్య

బళ్లారి, సెప్టెంబరు 16(ఆంధ్ర జ్యోతి): ఆంజనేయుడి జన్మస్థలంగా పేరుగాంచిన అంజనాద్రి కొండను దావణగెర కు చెందిన యువ తి విద్య బియ్యం బస్తా మోసుకుం టూ ఎక్కి మొక్కు లు తీర్చు కుంది. సోమవారం 25 కిలోల బియ్యం బస్తాతో అంజనాద్రి బెట్ట 575 మెట్లు ఎక్కింది. కొండ పైన ఉండే సాధువులు, అర్చకులు, స్వాములు, అలాగే వానరులు, ఇతర జీవులకు అవి ఆహారం అందించాలనే ఉద్దేశంతో బియ్యం బస్తాను కొండపైకి తీసుకెళ్లానని తెలిపింది. హనుమంతుడికి మొక్కు ఉన్న కారణంగానే తీర్చుకున్నాననంది. ఆమెతో పాటు తల్లిదండ్రులు, సోదరులు ఉన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక: కమిషనర్

రాయచూరు సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నివేశ స్థలాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా త్వరితగ తిన పూర్తి చేయాలని రాయచూరు మహానగర పాలిక కమిషనర్ జుబిన్ మొహపాత్ర సూచించారు. ఏఎల్‌పీ, జీ+2 ఆశ్రయ, దేవరాజ్ అరస ఆవాస్ పథ కానికి సంబంధించి మంగళవారం రాయచూరు మహానగర పాలిక కార్యాలయంలో ప్రగతి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కమిషనర్ జుబిన్ మొహపాత్ర, దరఖా స్తుల పరిశీలనలో అధికారులను బృందాలుగా విభ జించి క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు అన్ని రకాల అర్హతలను ప్రామాణికంగా తీసుకుని ఎంపికను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అధికా రులు, సూపర్‌వైజర్‌లు సహితం అప్రమత్తంగా ఉంటు నిజమైన అర్హులకు లబ్ది కలిగేలా జాబితా లను సిద్ధం చేయాలన్నారు.

వర్షాలకు మొక్కజొన్న రైతు విలవిల

● పొలాల్లోనే పాడవుతున్న పంట ● కంకులు మొలకెత్తి కుళ్లిపోతున్నాయని రైతుల ఆవేదన



పొలంలో మొక్కజొన్న కంకులను చూపుతున్న రైతులు



కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న

బళ్లారి సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాలు మొక్కజొన్న రైతును ముప్పుతిప్పలు పెడుతున్నాయి. జిల్లాలోని సిరుగుప్ప తాలూకా తెక్కల కోటలో పలు చోట్ల పొలాల్లోనే మొలకెత్తుతున్నాయి. రైతులు పండించిన పంటను కాపాడుకోవడానికి నానా కష్టాలు పడతున్నారు. నిరంతర వర్షాలు తేమ పెరుగుదల కారణంగా పండించిన మొక్కజొన్న మొలకెత్తుతున్నాయని వాపోతున్నారు. ఇలాగే కొనసాగితే మొక్కజొన్నను చెత్తగా పాడవేయాల్సివస్తుం దని రైతులు ఆందోళన చెందుతున్నారు. సిరుగుప్ప తాలూకాలో 2.680 హెక్టార్ల భూమిలో మొక్కజొన్న నాటారు. న 2.34లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి అవుతుందని బావిస్తున్నారు. ఎకరానికి 30నుంచి 35క్వింటాళ్ల మధ్య దిగుబడి వస్తుందని రైతులు భావిస్తున్నారు. ధరలు తగ్గడం, కొనుగోలు కేంద్రాలు తెవరకపోవడం వల్ల రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత సంవత్సరం క్వింటాల్‌కు రూ.2600, 2,800 కు విక్రయించి లాభం పొందారు. ఈ సంవత్సరం కూడా మంచి ధర ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. ధర క్వింటాల్‌కు రూ. 1,800, రూ.2.000 కు పడిపోయింది. ధరలు పడిపోవడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. వర్షాకాలంలో మొక్కజొన్న వేసిన రైతులు పంటను కోసి ఎండబెట్టే పనిలో ఉన్నారు. వర్షం నుంచి పంటను రక్షించుకోవడా నికి వారు పొలాన్ని టార్పాలిన్లతోకప్పి వర్షం ఆగిపోతుందని చూస్తున్నారని రైతులు భీమ్, జాడే సిద్దనగౌడ, వీరేశ్ తదితర రైతులు వాపోయారు.

ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

● పురసభ అధ్యక్షుడు బట్టా ప్రసాద్



ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బట్టాప్రసాద్

కంప్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పట్టణాల్లో ఏర్పాటు చేసే ఆరోగ్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోం చేసుకోవాలని పురసభ అధ్యక్షుడు బట్టాప్రసాద్ తెలిపారు. మంగ ళవారం కంప్లి పట్టణంలో సంగాత్రేయ పాఠశాలలో ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి సంస్థ అక్క మహాదేవి మహిళా సంఘం సంజీవిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో బెంగ ళూరు పట్టణం నుండి ప్రత్యేక డాక్టర్లు పాల్గొని 450 మంది పైగా రోగులకు చికిత్స కల్పిం చారు. పేద కుటుంబంలోని ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తరుణంలో ఇలాంటి శిబిరాల ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని కోరారు. పట్టణంలోని 23వ వార్డు ప్రజలు, తాలుకాలోని వివిధ గ్రామాల నుండి చికిత్స కోసం తరలివచ్చారు. కార్యక్ర మంలో శారదహీరేమట్, చంద్రశేఖర్, మూకయ్యస్వామి, డాక్టర్ జగదీష్, హేమయ్యస్వామి, వెంకటేష్, బర్మక్క, రాఘవేంద్ర రామాంజిని, మంజునాథ, సంజీవ్ పాల్గొన్నారు.

ఘనంగా స్నేహసమ్మేళన

బళ్లారిరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా విద్య, శిక్షణ సంస్థలో 2010-2012 సంవత్సరాల్లో విద్యనభ్యసించినవారు ఆదివారం గురువందన, స్నేహ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 15 సంవత్సరాల తరువాత ఉపన్యాసాలు ఇచ్చిన లెక్చరర్లు బోధ నేతర సిబ్బందిని ప్రత్యేకంగా సత్కరించి సన్మానించారు. హనుమక్క, మరిమడ నాయక్, బండి వీరప్ప, సత్యవాస్ బోగర్, జేఎం తిప్పేస్వామి, నరసింహప్ప పాత విద్యార్థులను ఉద్దే శించి ప్రసంగించారు. పరిచయకర్త గిరీష్‌కుమార్ మాట్లాడారు. రాజశేఖర్, బొమ్మఘట్ట, బిందు, చిత్రదుర్గ ప్రజెంటేషన్, మారుతి, రామాంజిని ధన్యవాదాలు తెలిపారు. చిత్రదుర్గ కళాశాల కోడైరెక్టర్ ఎం హనుమక్క, డైట్ ప్రిన్సిపాల్ జేఎం తిప్పేస్వామి పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

● ఎమ్మెల్యే గవియప్పకు కరవే వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న కరవే నాయకులు

హొస్పేట,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి):హొస్పేట నగరం నడి బొడ్డున ఉన్న బారుల్లావ కోర్టు ఎదురుగా ఉన్నప్రాంతంలో శని వారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో స్థానిక వ్యాపార వేత్త తిమ్మప్ప మరణించిన విషాద సంఘటన నగర వాసు లను దిగ్భ్రాంతికి గురిచేసింది. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. నిత్యం వాహనాలు వేగంగా వెళ్తున్నాయని వారు వాపోతున్నారు. సంబంధింతశాఖకు అనేక సార్లు విజ్ఞప్తి చేసినప్పటికి ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవ డంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రోడ్లపై వేగ నిరోధకాలను వెంటనే నిర్మించాలని, అవసరమైన సైన్ బోర్డు లను ఏర్పాటు చేయాలని, పోలీసు గస్తీని పెంచాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక రక్షణ వేదిక హొస్పేట ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవి యప్పకు వినతిపత్రం అందజేశారు.

పాఠశాలలో తహసీల్దార్ తనిఖీ



పిల్లలకు పాఠాలు చెబుతున్న తహసీల్దార్ నరసప్ప

కంప్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కురుగోడు తహసీల్దార్ నరసప్ప ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు పాఠాలు బోధించారు. కురుగోడు తాలుకా పరిధిలోని యర్రంగళి, మొరార్జీ దేశాయ్ వసతి ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఆహారం విద్యాభ్యాసం, విద్యార్థులకు ఇచ్చే ప్రభుత్వ సదుపాయాలపై ఆయన ఆరా తీశారు. డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, రెవెన్యూ అధికారి వీరభద్రయ్య, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న హిందూత్వ సంస్థలు

హిందూ కులాల ముందు క్రైస్తవపై ఆగ్రహం

● బీజేపీ, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నగరంలో నిరసన

బళ్లారి సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కుల సర్వేలో హిందూ కులాల ముందు క్రైస్తవ పదాన్ని చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ సామాజిక న్యాయ అవగాహన వేదిక నిరసనకారులు నగరంలోని జిల్లాకార్యాలయ ఆవరణలో నిరసన తెలి పారు. ఈపోరాటానికి హిందుత్వ సంస్థలు, బీజేపీ మద్దతు ఇచ్చాయి. నగరం లోని కనకదుర్గమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన నిరసన ప్రదర్శన గడిగ చెన్నప్ప సర్కిల్ మీదుగా జిల్లాపరిపాలన కార్యాలయానికి చేరుకుని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా కమ్మరచేడు మఠానికి చెందిన కళ్యాణ స్వామీజీ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల కమి షన్ నిర్వహించిన సామాజిక, విద్యా సర్వేలో రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ క్రైస్తవు లు, లింగాయత్ క్రైస్తవులు అనేక ఇతర కులాలను కులాల జాబితాలో క్రైస్తవు లుగా చేర్పించారన్నారు. బలవంతపు మతమార్పిడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సర్వే ద్వారా సమాజంపై దాడి చేయడా నికి ప్రణాళికలున్నాయన్నారు. కుల సర్వే ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపో తుందని జోస్యం చెప్పారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, బుడా మాజీ అధ్యక్షుడు మారుతీ ప్రసాద్, రామలింగప్ప, హనుమంతప్ప, బ్రాహ్మణ లింగామత్ నాయకులు పాల్గొన్నారు.

దేవదాసీలు, లింగ మైనార్టీలు సర్వేలో పాల్గొనాలి

● రాష్ట్ర మహిళా అభివృద్ధి సంస్థ అధ్యక్షురాలు పద్మావతి



మాట్లాడుతున్న పద్మావతి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న కులగణనలో పూర్వ దేవదాసీలు, లింగమైనార్టీలు పునః సర్వేలో పాల్గొని వారి సమాచారాన్ని నమోదు చేసుకోవాలని రాష్ట్ర మహిళా అభివృద్ధి సంస్థ అధ్యక్షులు పద్మావతి సూచించారు. మంగళవారం నగరంలోని జిల్లాకలెక్టర్ హాల్లో నిర్వహిం చిన జిల్లా మహిళా అభివృద్ధి సంస్థ ప్రగతి సమీక్ష సమావేశానికి ఆమె అధ్య క్షత వహించి మాట్లాడారు. ఈ సర్వేను రాష్ట్రంలో 1994-95 , 2007-08లో నిర్వ హించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ,ఉప ముఖ్యమంత్రి డికే.శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం దేవదాసీల పిల్లలను సామాజికంగా,విద్యాపరంగా ఆర్థి కంగా రాజకీయంగా అన్ని కోణాల్లో ముందంజలోకి తీసుకురావాలని లింగ మైనార్టీలను ప్రదాన స్రవంతిలోకి తీసుకురావాలన్నారు. వారి సాధికారత కోసం అనేక పథకాలు అమలు చేయబడ్డాయి. వాటి అమలు కోసం ఒక సర్వే నిర్వ హించబోతోంది. వారు తప్పకుండా చురుకుగా పాల్గొనాలని వారు అభ్యర్థించా రు. తదుపరి దేవదాసీల లింగమైనార్టీల సర్వేకు సంబంధించిన పోస్టర్లను ఆవి ష్కరించారు. ఈసందర్భంగా కర్ణాటక రాష్ట్ర మహిళా అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ అక్కమహాదేవి, డైరెక్టర్ రామకృష్ణనాయక్, సవిత, వివిధ సంఘాలు, సంస్థల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

హిందూ బెస్తర్‌గా నమోదు చేసుకోండి

● గంగ మతస్థుల సంఘం ఉపాధ్యక్షుడు నాగరాజు



కంప్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సామాజిక, విద్య సర్వేలో గంగా సమాజం కులాలవారు హిందూ బెస్తర్‌గా నమోదు చేసుకోవాలని కర్ణాటక రాష్ట్ర గంగాసమాజం రాష్ట్ర ఉపాధ్యక్షులు మన్నూరు నాగరాజు సూచించారు. మంగళవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ సామాజిక విద్య సర్వే నిర్వహిస్తోందని, రిజిస్ట్రేషన్ కోసం ఇంటికి వచ్చినప్పుడు సీరియల్ నెంబర్ 9లో బెస్తార్ సీరియల్ నెంబర్ 10లో ఉప జాతి (పాఠశాల రిజిస్ట్రేషన్ ప్రకారం 37 ప్రత్యామ్నాయ పదాలలో ఒకటి) సీరియల్ నెంబర్ 11లో బెస్తార్, క్లాస్ ఆక్యుపేషన్ అనే కాలంలో కబ్బర్, అంబిగ, బారిక, సునగర, గంగామత అనే పదాలు చేర్చాలన్నారు. రాష్ట్రంలోని 22 జిల్లా లను బెస్తర్‌గా గుర్తించారని, ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి కే మనోహర్ తాలుకా అధ్యక్షుడు ఎలెగర నాగరాజు, నాయకులు బి సిద్దప్ప, బి ఈరప్ప అయ్యోది వెంకటేష్, కట్టి దురుగప్ప, పత్తర్, వీరభద్రప్ప, కట్టి వెంకటేష్, జోలమారో ఈరన్న, రంగప్ప, ఎస్ సురేష్, కే ప్రకాష్, జీ యల్లప్ప, మన్నూరు, జీ యల్లప్ప, రామాంజిని, బోవి మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

కురుబలు సర్వేలో పాల్గొనాలని పిలుపు



మాట్లాడుతున్న సంఘం నాయకులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ సెప్టెంబరు 22నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కులగ ణన చేపట్టనున్న నేపథ్యంలో కర్ణా టక ప్రదేశ్ కురుబర సంఘం మంగళవారం సమావేశం అయ్యింది. కురుబ సంఘం నాయకులు ఎం.రామచంద్రప్ప నేతృత్వంలో బళ్లారి గొర్రెల కాపరుల(కురుబ) సంఘం హాల్లో ప్రాథమిక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మన సమాజంలోని సోదరులు ప్రభుత్వ గెజిట్ నంబర్ 0809లోని కుల కాలమ్ నంబర్ 9లో కురుబ అనే పదాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర డైరెక్టర్ గాదిలింగనగౌడ, ప్రధాన కార్యదర్శి మోహన్, కోశాధికారి కామ్‌రాజు, కొళగల్లు అంజిని, కరిబసప్ప, బట్టి ఎర్రిస్వామి, జోగి చంద్రప్ప, మరిస్వామిరెడ్డి, రాజా, నాగరాజు, దమ్మూరు సోమప్ప సంఘం నాయకులు పాల్గొన్నారు.


కలెక్టర్‌తో వాల్మీకి నాయకుల భేటీ



కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్‌ను సత్కరిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

బళ్లారిరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టర్ కార్యాల యంలో నూతన కలెక్టర్ నాగేంద్రప్రసాద్‌ను అఖండ వాల్మీకి సంఘం నాయకులు మంగళవారం భేటీ అయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మప్ప, జోళద రాసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పీడీహళ్లి జనార్దన్ నాయక్, జిల్లా అధ్యక్షుడుఎర్రగుడి ముద్దు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఎం సత్యనారాయణ, సీనియర్ అడ్వకేట్ జయరాం, కమలా మర్రిస్వామి, రూపనగుడి గోవిందు, రుద్రప్ప, బసవరాజు, చంద్రశేఖర్, కృష్ణ, వన్నూరప్ప, బెనకల్లు, మారెన్న పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు



ఆంజనేయ (ఫైల్)

రాయచూరు సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): నగర సమీపంలోని అస్కిహాళ్‌కు చెందిన 62 ఏళ్ల వృద్ధుడు ఆంజ నేయ అదృశ్యమయ్యారు. 14వ తేదీ ఉదయం యధావిధిగా ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఆంజనేయ తిరిగి రాకపోవ డంతో కుటుంబ సభ్యులు మంగళవారం వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హోసూరు జోన్



కాలువలో రసాయన వ్యర్థాలను చూపుతున్న స్థానికులు

రసాయన వ్యర్థాలపై ఆందోళన

హోసూరు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): నగరంలోని 14వ వార్డు లక్ష్మీనారాయణనగర్ ప్రాంతంలో రసాయన వ్యర్థాలు పేరుకుపోవడంతో స్థానికులలో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇక్కడ 500కుపైగా నివాసాలు ఉన్నాయి. నివాసాల మధ్య రోజుల తరబడి రసాయన వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల పలు రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందని వాపోతున్నారు. స్థాని కంగా ఉండే చిన్నచిన్న ఫ్యాక్టరీలు రసాయన వ్యర్థాలను శుద్ధి చేయకనే వదిలివేయడంపై ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి దారి తప్పకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని డిమాండ్

హోసూరు కార్పొరేషన్ పరిధిలోని టీ దుకాణాలు, రెస్టారెంట్లలో చాలాచోట్ల సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ కవర్లు, పేపర్‌కప్పుల వాడకం నియంత్రణలో ఉండాలని పలువురు అభిప్రాయపడుతు న్నారు. కార్పొరేషన్ పరిధిలో ని పలు దుకాణాలు, రైతుబజార్లలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం పెరిగిందని, వాటిని ఉపయోగించాక బహిరంగ ప్రదేశాలు, మురుగుకాలువలలో పడేస్తుండ డంతో సమస్యగా మారిందని ప్రజలు అంటున్నారు. ఈ కవర్లు, కప్పులు ఆహార వ్యర్థాలతో ఉండడంతో పశువులు తిని అనారోగ్యానికి గురవుతున్నాయని, కాలువలలో భారీగా చేరుకుని మురుగునీరు సజావుగా ప్రవహించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఈ తరు ణంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. సింగిల్ యూజ్ కవర్లు, కప్పుల వినియోగం అధికమైతే వాటివల్ల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూసే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయంగా ఉంది. ఈ నేపథ్యంలో తగిన చర్యలు తీసు కోవాలని ప్రజలు కోరుతున్నారు.

205 కిలోల గుట్కా స్వాధీనం

హోసూరు (క్రైం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆమీరియా జంక్షన్ సమీపాన మంగళవారం వాహన తనిఖీల సందర్భంగా కార్గో ఆటోను పరిశీలించగా నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కాను గుర్తించారు. సుమారు 205 కిలోల గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి కృష్ణగిరికి గుట్కాను అక్రమంగా తరలిస్తున్నట్టు విచారణలో తేలింది. నిందితుడు విల్లుపురం జిల్లా శంకరపురం ప్రాంతానికి చెందిన వినోద్ (35)గా గుర్తించారు. గుట్కా విలువ సుమారు 1.33 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. గుట్కాతోపాటు కార్గో ఆటోను స్వాధీనం చేసుకున్నారు. హోసూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



హుషారుగా నడుస్తున్న తాతలు



మాట్లాడుతున్న న్యాయాధికారి రాజేష్ హొసమని

అవ్వారే..!

బళ్లారి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అవ్వలు.. తాత లు..హుషారుగా నడక పందెంలో పాల్గొన్నారు. వచ్చిన వాళ్లంతా వృద్ధులే అందరూ 70 ఏళ్ల వయస్సు పై బడిన వారే. సుమారు 2వేల మందికి పైగా ఓచోట చేరారు. ఆనాటి తియ్యటి జ్ఞాపకాలతో పాటు నేటి పరిస్థితులపై చర్చించుకుంటూ హుషారుగా గడిపారు. ఉల్లాసంగా గడపడానికి అధికారులు ఆటలపోటీలు ఏర్పాటు చేశారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం బళ్లారిలోని బీఎంసీఆర్‌సీ మైదానంలో జిల్లా యంత్రాగం, జిల్లా పంచాయతీ, జిల్లా న్యాయసేవల ప్రాధికార సంస్థ, మహిళా శిశు అభివృద్ధి శాఖ, దివ్యాం గులు, సీనియర్ సిటిజన్ల సాధికారత శాఖ, యువజన సేవలు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. వివిధ స్వచ్ఛంధ సంస్థల సహకారంతో క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు.

వృద్ధులను గౌరవించాలి : న్యాయాధికారి రాజేష్ ఎస్.హసమనె

వృద్ధుల దినోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీని యర్ సివిల్ న్యాయాధికారి రాజేష్ ఎన్. హొసమని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులంటే భారం కాదని అందరి బాధ్యతని అన్నారు. వారిని అందరూ గౌరవించాలన్నారు. యువకులు వారిని చిన్నచూపు చూడకంగా గౌరవించడం అలవరచుకోవాలన్నారు. ఈసందర్భంగా జరిగిన క్రీడలు, సాంస్కృతిక, పౌరాణిక, జానపద కళల్లో వృద్ధులు హుషారుగా గడిపారు. పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు సంక్షేమశాఖ అధికారి గోవిందప్ప హెచ్. మహిళా శిశు అభివృద్ధిశాఖ జిల్లా అధికారి సవిత, సండూరు బాలల అభివృద్ధి అధికారి నాగరాజ్, అంతర్జాతీయ అథ్లెటర్ సత్యనారాయణ, చెంగారెడ్డి వృద్ధాశ్రమం నిర్వహకులు గురుమూర్తి, సంగనకల్లు ఆదర్శ హోం అద్యక్షడు వెంకోబప్పజ సిరు గుప్ప భీమా విద్యాసంస్థకు చెందిన మహేష్, కుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి: ఎమ్మెల్యే

సిరుగుప్ప, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గెలుపోటములను సమానంగా తీసుకో వాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు పిలుపు నిచ్చారు. మంగళవారం తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో పీయుసీ కళాశా లలో క్రీడాజ్యోతిని వెలిగించి ఆయన మాట్లాడారు. క్రీడల వలన మనిషికి ఉల్లాసం, ఉత్సాహం కలుగుతుందని ఆయన తెలిపారు. విద్యార్థులు చదువు లతో పాటు క్రీడల్లో కూడా పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున, బాలప్ప, వ్యాయామ ఉపా ధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగించిన ఎమ్మెల్యే బీఎం నాగరాజు, మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప